సాక్షి
రంగారెడ్డి
గురువారం । 16 । జనవరి । 2025



ఆరోగ్య 'కుసుమ'ం

ఆరరోగ్యానికి మేలు చేసే నూనెగింజల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు తెల్ల కుసుమకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 8లో▸



జంట హత్యల కలకలం

పుప్పాలగూడలో జంట హత్యలు కలకలం రేపాయి. వివాహిత, ఆమె ప్రియుడిని దారుణంగా హత్య చేశారు. 8లో▸



సెలవుల్లోనూ సై అన్నారు!

పండగ వేళ జలమండలి యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి పలు ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతులు చేసింది. 8లో▸

న్యూస్‌రీల్

సీజ్ చేసిన వాహనాలకు 19న వేలం

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఆర్టీఏ పరిధిలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 19న వేలం వేయనున్నట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుభాష్ చందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మహేశ్వరం, బండ్లగూడ, హయత్ నగర్, ఇబ్రహీంపట్నం పరిధిలో పన్నులు చెల్లించని, ఇతర కారణాలతో సీజ్ చేసిన వాహనాలను మన్నెగూడలోని ఆర్టీఏ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనాలనుకునే వారు రూ.500 దరఖాస్తు రుసుము, డిపాజిట్ రూ.2 వేలు చెల్లించాలని సూచించారు. సీజ్ అయిన వాహనాలను యజమానులు తీసుకోవాలనుకుంటే ఈనెల 18లోపు ఆర్టీఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వేలం వేయనున్న వాహనాల వివరాలు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

యూపీ టు సిటీ

- అక్రమంగా ఆయుధాల సరఫరా
- 2 తుపాకులు, తపంచా విక్రయానికి ప్లాన్
- పోలీసులకు చిక్కిన నిందితుడు



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు ఆయుధాలను అక్రమంగా సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. 2 తుపాకులు, 10 బుల్లెట్లు, తపంచాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ జాదవ్ 2019లో తన అన్న మురళితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. బీబీనగర్‌లోని ఓ కంపెనీలో పనిలో చేరాడు. మూడేళ్ల పాటు పనిచేసిన తర్వాత 2022లో ఉద్యోగాన్ని వదిలేసి సొంతూరు రాంపూర్ బోహాకు వెళ్లిపోయాడు. అక్కడే పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. హరేకృష్ణ స్వగ్రామం బిహార్‌కు సరిహద్దు గ్రామం కావడంతో అక్కడ అక్రమంగా ఆయుధాలు తయారు చేసేవారితో ఇతనికి పరిచయాలు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో పెద్దగా సంపాదన లేకపోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తక్కువ ధరకు తుపాకులు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో విక్రయించాలని పథకం వేశాడు. ఈక్రమంలో బిహార్‌లోని షాపూర్ గ్రామానికి చెందిన సంపత్ యాదవ్ నుంచి మూడు ఆయుధాలు కొనుగోలు చేశాడు. వీటిని తీసుకొని బుధవారం హైదరాబాద్ వచ్చాడు. జవహర్‌నగర్ ఠాణా పరిధిలోని అంబేడ్కర్ నగర్ బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న భువనగిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), జవహర్‌నగర్ పోలీసులు హరేకృష్ణ జాదవ్‌ను అరెస్టు చేశారు.

రోగులతో ప్రేమగా మెలగాలి

దుద్యాల్: ఆస్పత్రికి వచ్చే రోగులతో ప్రేమగా మెలగాలని.. చికిత్స అందించే విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గతంలో ఆస్పత్రి వసతి లేక పేదలు కోస్గి, కొడంగల్, పరిగి, మహబూబ్‌నగర్ వెళ్లేవారని గుర్తు చేశారు.



గాంజా... పంజా!

నిర్మానుష్య ప్రాంతాలే అడ్డా

- మత్తులో జోగుతున్న యువత, విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: కొంతమంది యువత, విద్యార్థులు గంజాయి మత్తులో ఊగి, తూగుతున్నారు. పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తూ చిన్న విషయాలకే అల్లర్లకు పాల్పడుతున్నారు. దీంతో బాలాపూర్ మండలం, బడంగ్‌పేట కార్పొరేషన్ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గంజాయి అమ్మకం, రవాణాను కట్టడి చేయాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడ్డాలు అనేకం..

బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సీకేఆర్ కేటీఆర్ ఫంక్షన్ హాల్ వెనకాల, రాఘవేంద్ర కాలనీ, మౌంట్ కార్మెల్ స్కూల్ సమీపంలోని నూతనంగా వెలిసిన వెంచర్లల్లో, 119 సర్వేనంబర్, భీష్మనగర్ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతం, సాయిబాలాజీనగర్, మునిసిపల్ కాలనీల మధ్య ఉన్న ఓపెన్ స్థలాలు, బాలాపూర్, ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వెనకాల ఉన్న వెంచర్, దీని పరిసర ప్రాంతాల్లో, స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ, అల్మాస్‌గూడ, జేఎస్ ఎంయూఆర్ఎం నివాస గృహాల వద్ద, నాదర్‌గుల్‌లోని మర్రి లక్ష్మమ్మ వెంచర్ పరిసరాల్లో.. ఇలా చెప్పుకుంటూ పోతే మనుషుల రాకపోకలు తక్కువగా ఉండే ప్రాంతాలను అడ్డాగా చేసుకుని యువత, విద్యార్థులు మత్తులో జోగుతూ.. కేరింతలు కొడుతున్నారు.

విద్యార్థులే టార్గెట్

బడంగ్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనకాల విద్యార్థులను టార్గెట్ చేసుకుని గంజాయి విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. గుర్రంగూడలో కొంత విద్యార్థులను (6నుంచి 10 తరగతులు) గంజాయి ముఠా సభ్యులు టార్గెట్ చేస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్న వారితో గంజాయి తాగిస్తూ క్రమంగా వారిని బానిసలుగా చేస్తున్నారని సమాచారం. పలు ఇంజనీరింగ్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు కాలేజీలకు డుమ్మా కొడుతూ.. గంజాయి మత్తులో గడిపేస్తున్నారు.

స్టార్స్‌తో అవగాహన

గాంజా, డ్రగ్స్‌తో దుష్పరిణామాలపై సినీ స్టార్లు, ఎంతో మంది ప్రముఖులతో ప్రభుత్వం ప్రకటనలు చేయిస్తోంది. ఎవరూ మత్తుకు బానిస కావద్దని, అలాంటి వారిని రిహాబిలిటేషన్ సెంటర్లో చేర్పించి, మార్పునకు ప్రయత్నిస్తోంది. కానీ మత్తుకు బానిసైన వారి బాధిత కుటుంబాలు తమ పరువు పోతుందనే కారణంతో ఇందుకోసం ముందుకురావడం లేదు.

చిన్న ప్యాకెట్లుగా విక్రయం

మీర్‌పేట్, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆదిబట్ల ఠాణాల పరిధిలో పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్న కొంతమంది సభ్యులను పోలీసులు అనేక సార్లు పట్టుకున్నారు. దీంతో గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కొంతమంది ఆటోవాలాలకు గంజాయి అలవాటు చేయించి, వారితో సరఫరా చేయిస్తున్నారు.

❖ చెప్పేవారే లేరు..

మత్తులో బైకులు, కార్లు తీసుకెళ్తున్న యువత అతి వేగం, ర్యాష్ డ్రైవింగ్‌తో రోడ్లపై భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. గంజాయి సేవిస్తున్న ముఠాల వద్దకు వెళ్లాలన్నా, స్థానిక యువతకు చెప్పాలన్నా అందరూ తెలిసిన వాళ్లే కావడంతో ఇటు పోలీసులు, అటు ప్రజాప్రతినిధులు వెనకడుగు వేస్తున్నారు. పది రోజుల క్రితం గంజాయి మత్తులో వచ్చిన ఓ యువకుడు బార్‌లోకి ప్రవేశించి వెయిటర్‌పై దాడి చేయడంతో 30కి పైగా కుట్లు పడి ప్రాణాలతో బయటపడ్డారు. మత్తులో జోగుతున్న యువత, ఎదురుదాడులకు దిగుతున్నా.. ఇది తప్పు అని నచ్చజెప్పేందుకు ఎవరూ సాహసించడం లేదు. దారి వెంట వెళ్లే యువతులు, బాలికలపై దాడులు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన

చేతికొచ్చిన కొడుకులు, బిడ్డలు రోజు మత్తులో జోగుతుంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గంజాయికి బానిసైన వారితో స్నేహం చేస్తున్న అమాయక యువత, విద్యార్థులు మెల్లగా ఆ ఉచ్చులోకి దిగుతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలతో పాటు పరిసర ప్రాంతాల వారి దుస్థితిని చూసి పేరెంట్స్ కన్నీరుమున్నీరవుతున్నారు.



గంజాయి పీలుస్తూ మత్తులో జోగుతున్న యువత



అంతా ఏకమైతేనే కట్టడి

ప్రభుత్వం, పోలీసులపైనే భారం మోపకుండా అంతా ఏకమై పోరాటం చేస్తేనే గంజాయి కట్టడి సాధ్యమవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనను ఎప్పుడూ గమనిస్తుండాలి. బెల్టు షాపులు ఎత్తివేయించి, యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు గురికాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. కుల, మత ప్రచారాలకంటే సమాజం నుంచి మత్తును పారదోలే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఇబ్రాం శేఖర్, డిప్యూటీ మేయర్, బడంగ్‌పేట్



వివరాలు వెల్లడిస్తున్న షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్

అమాయకులే టార్గెట్

ఏటీఎం కార్డులతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా

- డబ్బులు డ్రా చేసి ఇస్తామంటూ దోపిడీలు
- ముగ్గురు దుండగులకు రిమాండ్
- రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: అమాయకులు, మహిళలను టార్గెట్‌గా చేస్తారు.. ఏటీఎంలలో డబ్బులు తీయడం రాని వారిని పరిచయం చేసుకుంటారు.. డబ్బులు తీసిస్తామని దృష్టిమరల్చి ఏటీఎం కార్డు మార్చేసి డూప్లికేట్ కార్డు ఇస్తారు. ఒరిజినల్ కార్డుతో డబ్బులు డ్రా చేసుకుంటారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ముగ్గురు సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

ఉపాధి కోసం వచ్చి

బీహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్, సోనబర్సా గ్రామానికి చెందిన కరిమన్‌సహాని, రూప్‌దేవ్‌సహాని, పంజాబ్ రాష్ట్రం కపుర్తల పగ్వారా గ్రామానికి చెందిన సహీబ్‌సహాని కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వచ్చారు. కూలీ పనులు చేస్తూ శంషాబాద్ మండలం తొండుపల్లిలో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే పథకం వేసి ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్నారు.

15 సార్లు చోరీలు

ఏటీఎం కార్డులు దోపిడీకి పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా ఏటీఎంల వద్ద నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. షాద్‌నగర్, ఆర్‌జీఐఏ, పటాన్‌చెరు, శంషాబాద్‌లో రెండేసి చొప్పున, దుండిగల్, సనత్‌నగర్, జడ్చర్ల, గచ్చిబౌలి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, బాలానగర్ ఏటీఎంల వద్ద ఒక్కోటి చొప్పున మొత్తం 15 దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, సైబారాబాద్ ఎస్ఓటీ డీసీపీ శోభన్‌బాబు, సీఐ సంజయ్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, విచారణాధికారి డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శరత్ కుమార్, క్రైం టీం మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

జడ్చర్లలో కేసుతో ఆటకట్టు..

నందిగామ మండలం, శ్రీనివాసులగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి రాజు 2024 ఆగస్టు 5న జడ్చర్ల రోడ్డులోని ఐడీబీఎం ఏటీఎంకు వెళ్లాడు. ఈయనకు డబ్బులు తీయడం రాదని గ్రహించిన దుండగులు, అతని వద్దకు వెళ్లి కార్డు మార్చేశారు. కొంతసేపటి తర్వాత తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన రాజు అదేరోజు షాద్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో ముఠా సభ్యులను పట్టుకున్నారు.



కన్హా శాంతి వనం నిర్వాహకులతో మాట్లాడుతున్న డాక్టర్ చిన్నారెడ్డి

ప్రశాంతతకు నిలయం కన్హా

నందిగామ: కన్హా శాంతివనం ప్రశాంతతకు నిలయంగా రూపు దిద్దుకుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఆయన కన్హాను సందర్శించారు. శాంతివనం ప్రత్యేకతలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నిత్యం అనేక రకాల ఒత్తిడులతో ఇబ్బంది పడేవారికి రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్హా శాంతి వనం మానసిక ప్రశాంతతను చేకూరుస్తోందని తెలిపారు. నిరంతర ధ్యానంతో అనేక రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఏక కాలంలో లక్ష మంది ధ్యానం చేసుకునేలా గురూజీ కమ్లేష్ డి.పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.

చెత్తను పీల్చే.. 'జటాయు'

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో మెరుగైన పారిశుధ్యానికి పలు విధాలుగా చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ.. వాక్యూమ్ మెషిన్లను వినియోగించేందుకు సిద్ధమవుతోంది. సాధారణ స్వీపింగ్ మెషిన్‌లో దిగువన చీపుర్ల వంటి ఉపకరణాలు రోడ్లను శుభ్రం చేస్తే 'జటాయు సూపర్' అనే వాహనంలో ఉండే గొట్టం మాదిరి ఉపకరణం రోడ్లపై వ్యర్థాలన్నింటిని లాగి వాహనంలో పడవేస్తుంది. గొట్టాన్ని పట్టుకొని పారిశుధ్య కార్మికుడు చెత్త కుప్పల వద్ద ఉంచితే చెత్తను మొత్తం పీల్చుతుంది. కాంటాక్ట్‌లెస్ ఫ్యాన్ టెక్నాలజీతో పని చేసే ఇది త్వరితంగా వ్యర్థాలను శుభ్రం చేయడంతో పాటు ఎలాంటి వాతావరణంలోనైనా వినియోగానికి అనువైనదని అధికారులు చెబుతున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఖైరతాబాద్ జోన్‌లో ఒక మెషిన్‌ను వినియోగించి చూసి, ఫలితాన్ని బట్టి అదనపు మెషిన్లను అందుబాటులోకి తేనున్నట్లు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్(పారిశుధ్యం) ఎస్. రఘుప్రసాద్ తెలిపారు. ఈ వాహనాన్ని సమకూర్చుకున్న కాంట్రాక్టు ఏజెన్సీ గురువారం దీని పనితీరును ప్రదర్శించనుందన్నారు. పని తీరు బాగుంటే అద్దె ప్రాతిపదికన వినియోగించనున్నారు.



జటాయు సూపర్ ఏం చేస్తుంది?

ఇళ్లలోని దుమ్మూ ధూళిని శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ లాంటి మెషిన్ జటాయు సూపర్. ఇది రోడ్లపై చెత్తను, చిన్నచిన్న రాళ్లను మాత్రమే కాకుండా గుట్టలుగా పోగుపడ్డ అన్ని రకాల చెత్తను పైప్ వంటి ఉపకరణంతో గుంజుకొని శుభ్రం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. స్వీపింగ్ మెషిన్ లాంటిదే జటాయు సూపర్ కూడా. ఇందులో ఉండే శక్తిమంతమైన సక్షన్ పంపులు చెత్తను గొట్టంలోకి గుంజుతాయి. ఎప్పుడైనా, ఎక్కడైనా, తడి పొడి చెత్తను సైతం గుంజుతుందని అధికారులు పేర్కొన్నారు. చెత్తలో ఉండే కొబ్బరిచిప్పలు, పగిలిన గ్లాసులు, సీసాలు, ఆకులు, కాగితాల వంటి అన్ని రకాల చెత్తను సక్షన్ పవర్‌తో లాగేస్తుందని తెలిపారు. క్లీన్ చేశాక నేలపై ఎలాంటి చెత్త, రాళ్లవంటివి కూడా కనిపించవు అని చెబుతున్నారు.

చెత్త కుప్పలు తొలగించే సరికొత్త యంత్రం

- ప్రయోగాత్మకంగా ఒక జోన్‌లో..
- పని తీరు బాగుంటే అదనంగా మరిన్ని అందుబాటులోకి..
- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న జీహెచ్ఎంసీ

పారిశుద్ధ్యానికా.. ప్రైవేటు ఏజెన్సీల కోసమా ?

పారిశుద్ధ్యం కోసం కొత్త సాంకేతికతతో కూడిన జటాయు సూపర్‌ను పరిశీలించనున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రైవేటు కాంట్రాక్టు ఏజెన్సీల ప్రయోజనం కోసమే వీటిని తెచ్చే యోచన చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పర్యాటక ప్రాంతాలు, వీఐపీ మార్గాలు పేరిట పారిశుద్ధ్య నిర్వహణకు అంటూ ప్రైవేటు ఏజెన్సీలకు భారీ మొత్తంలో నిధులు ధారపోస్తున్నారనే విమర్శలున్నాయి. ఆ మార్గాల్లో పారిశుద్ధ్యం ఏమాత్రం మెరుగుపడకపోయినా, అదనపు చెల్లింపుల వెనుక అమ్యామ్యాలున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మెషిన్ల పేరిట మరో కొత్త ఎత్తుగడ వేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి.



వినువీధుల్లో ఆనంద లహరి!

ముగిసిన కైట్ ఫెస్టివల్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వీట్స్, కైట్స్ ఫెస్టివల్ బుధవారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల్లో సుమారు 15 లక్షల మంది సందర్శించినట్లు అంచనా. ఇండోనేషియా, స్వీడన్, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కాంబోడియా, థాయ్‌లాండ్, సౌత్ కొరియా, జపాన్, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేసియా, ఇటలీ, ట్యునీషియా, సౌత్ ఆఫ్రికా, పోలండ్, సింగపూర్, ఉక్రెయిన్, ఫ్రాన్స్ దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ కైట్ ఫ్లయర్స్, 13 రాష్ట్రాలకు చెందిన 50 మంది దేశీయ కైట్ ఫ్లయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. చిరుత, చింపాంజీ, ఈగల్, పులి, పాము, టెడ్డీ, రోబోట్, సన్‌ఫ్లవర్, డోరేమాన్ చిన్నారులతో పాటు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌ల చేతుల మీదుగా ఈ నెల 13న ప్రారంభమైన కైట్స్, అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌ను 14, 15వ తేదీల్లో పలువురు వీఐపీలు సందర్శించారు. సంక్రాంతి రోజు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొని స్వయంగా పతంగులు ఎగురవేసి సందడి చేశారు. బుధవారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సింగర్ మంగ్లీ బృందం ఆలపించిన గీతాలు శ్రోతలను అలరించాయి. స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో 1,200 రకాల కుల్ల మిఠాయిలు ఆహార ప్రియులను చవులూరించాయి. ముగింపు కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, సాంస్కృతిక సారథి వెన్నెల, నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.





ఆటో బోల్తా.. వ్యక్తి దుర్మరణం

- సురంగల్‌లో ప్రమాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు


మృతుడు ప్రవీణ్‌కుమార్(ఫైల్)

మొయినాబాద్: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్ల ప్రవీణ్‌కుమార్ అలియాస్ పెంటయ్య(41) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 5గంటల సమయంలో మొయినాబాద్ నుంచి సురంగల్ వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ఆటోను రోడ్డు దింపాడు. అనంతరం రహదారిపైకి ఎక్కిస్తుండగా అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. ప్రవీణ్ ఆటో కింద పడటంతో తల, పొట్ట భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వచ్చి చికిత్స కోసం అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇందిరానగర్‌లో భారీ చోరీ

బంజారాహిల్స్: ఇంటి తాళాలు పగులగొట్టి భారీగా నగదు, నగలు చోరీకి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2, ఇందిరానగర్‌లో నివసించే లోవకుమారి, వీర వెంకటరమణ దంపతులు కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 12న ఇంటికి తాళం వేసి రాజమండ్రికి వెళ్లారు. ఈ నెల 14న ఉదయం అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న కరుణాకర్ అనే వ్యక్తి మోటార్ ఆన్ చేసేందుకు కిందికి వచ్చి చూడగా లోవకుమారి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తలుపు పక్కన కిటికీతో పాటు బీరువా ధ్వంసమై ఉండడమే కాకుండా వస్తువులన్నీ చెల్లాచెదురై ఉన్నాయి. దీంతో అతను వీర వెంకటరమణకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఆందోళనకు గురైన లోవకుమారి, వీర వెంకటరమణ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇల్లు కొనుగోలు నిమిత్తం బీరువాలో దాచిన రూ.25 లక్షల నగదుతో పాటు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన ఆభరణాల్లో బంగారు హారం, గొలుసు, గాజులు, ఉంగరాలు, నెక్లెస్, పాపిడి బిళ్ల, బంగారు బిస్కెట్లు, చెవి రింగులు, లక్ష్మీ రూపులు, లక్ష్మీ రూపు విగ్రహం, వెండి పళ్లెం, పట్టీ గొలుసులు, వెండి గిన్నె ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్లు తాళం వేసి ఉన్నట్లు గుర్తించిన దొంగలు పథకం ప్రకారం డోర్ పక్కన ఉన్న కిటికీ అద్దాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లే మార్గాలను తెలుసుకుని చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఒక మహిళ, ఒక యువకుడు సంచుల్లో ఆభరణాలు, డబ్బులు నింపుకుని వెళ్తున్న దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య 'కుసుమ'ం

పెరుగుతున్న తెల్లకుసుమ సాగు విస్తీర్ణం

- అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం
- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించాలని రైతుల డిమాండ్


షాబాద్ మండలం మద్దెంగూడలో రైతులు సాగు చేసిన తెల్లకుసుమ

షాబాద్: నూనెగింజల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు తెల్ల కుసుమకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కెట్‌లో కుసుమ నూనెతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. మండల పరిధిలోని రేగడిదోస్వాడ, మద్దెంగూడ, ఏర్రోనిగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, గోల్లూరుగూడలో 286 మంది అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్ 746 రకం కుసుమ విత్తనాలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో ఈ పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యతలేని నకిలీ నూనెలు కుప్పలు తెప్పలుగా మార్కెట్లోకి వస్తున్న నేటి తరుణంలో వినియోగదారుడు ఏ వంట నూనెను నమ్ముకోవాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గతంలో ఏ ఇంట చూసినా ఏడాదిపాటు అవసరమయ్యే తెల్లకుసుమన నూనెను నిల్వ ఉంచుకునేవారు. కానీ క్రమంగా సాగు తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. తెల్లజొన్న, శనగ పంటలో తెల్లకుసుమను అంతర పంటగా సాగు చేసేవారు. అయితే పత్తిసాగు పెరగడం తెల్ల కుసుమ తగ్గింది. ఖరీఫ్‌లో సాగు చేస్తే పత్తి రబీ సీజన్ వరకూ దిగుబడి ఇస్తుండటంతో కుసుమ సాగుకు అవరోధం ఏర్పడుతోంది. దీనికి తోడు కుసుమ సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లభించడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు తెల్ల కుసుమకు రూ.6 వేలు పలుకుతోంది. వీటిని మర ఆడించి, తీసిన నూనెను కిలోకు రూ.450 చొప్పున విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కుసుమ నూనె మార్కెట్‌లో లభించడం లేదు. దీంతో మిల్లుల వద్ద, లేదా రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కుసుమ ప్రాధాన్యం గుర్తిస్తున్న రైతులు ఈ పంట వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్లో ఉన్న డిమాండ్ వీరికి కలిసి వచ్చే అవకాశం ఉంది.

మూడేళ్లుగా సాగు



మూడేళ్లుగా తెల్ల కుసుమ సాగు చేస్తున్నాం. పొలంలో పండించిన కుసుమలను గానుగు ఆడించి, నిల్వ చేసి ఏడాది పొడవునా వినియోగిస్తాం. రుచికరమైన వంటలకు, ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలైనవి.

– కదుమూరు వితలయ్య, తిర్మలాపూరం

ఆరోగ్యానికి మంచిది



రైతులు పండించిన నూనె గింజలను కొనుగోలు చేసి నూనె పట్టించుకోవాలి. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమలను గానుగాడించే వారం. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే కుసుమ నూనె పటిస్తారు.

– పర్వేద మల్లేశ్, రైతు బొబ్బిలిగామ

వాటర్ బాటిల్ అనుకుని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

మియాపూర్: వాటర్ బాటిల్ అనుకుని రోడ్డుపై పడి ఉన్న యాసిడ్ తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, శెట్టి బలిజపేట గ్రామానికి చెందిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ(41) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట్ మార్తాండ నగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కూలి పనికి వెళ్లిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా హాఫీజ్‌పేట్ రోడ్డు సమీపంలో రోడ్డుపై పడి ఉన్న బాటిల్ తీసుకుని నీళ్ల అనుకుని యాసిడ్ తాగాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే నోట్లో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాయుడు గోవింద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట: ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడ్ వచ్చిన యువకులు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఓ విలేకరి తీవ్రంగా గాయపడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన రమేష్ (57) యూసుఫ్‌గూడలో ఉంటూ ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. మంగళవారం అతను తన అల్లుడితో కలిసి వేర్వేరు బైక్‌లపై ఎస్ఆర్‌నగర్‌కు వచ్చారు. ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి పాత పోలీస్‌స్టేషన్ వైపు వెళుతుండగా వెనక నుంచి త్రిబుల్ రైడ్‌తో వేగంగా వచ్చిన యువకులు రమేష్ బైక్‌ను ఢీకొట్టారు. అతను కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా ప్రమాదానికి కారణమైన యువకుల కోసం గాలిస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ

జీడిమెట్ల: యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ గణేష్‌నగర్‌కు చెందిన మలిశెట్టి లక్ష్మీవరమోహన్ కుమారుడు దేవహర్ష(26) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను ఆఫీసు నుంచి ఇంటికి బయలుదేరాడు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ వైపు వస్తుండగా, అదే సమయంలో పద్మానగర్ ఫేజ్-2కు చెందిన పవన్‌రెడ్డి కుత్బుల్లాపూర్ చౌరస్తా వైపు వెళ్లేందుకు చింతల్ కేఎఫ్‌సీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఇద్దరి బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ ఎగిరి కింద పడటంతో వారి తలలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను సూరారంలోని మల్లారెడ్డి అస్పత్రికి తరలిస్తుండగా దేవహర్ష మార్గ మధ్యలోనే మృతి చెందాడు. పవన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

కుషాయిగూడ: గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం చర్లపల్లి పీఎస్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాలిలా ఉన్నాయి. చర్లపల్లి, పుకట్‌నగర్ దారిలో ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వెళ్లి వివరాలు సేకరించారు. 35ఏళ్ల యువకుడిని బండరాళ్లతో మోది హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించాయి. మృతుడు జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందినవాడై ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు


మంగమ్మకు కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుళ్లు

బాలానగర్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ మహిళ రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సమాచారం అందడంతో సకాలంలో స్పందించిన పోలీసులు ఆమెను రక్షించారు. బాలానగర్ పీఎస్ పరిధిలోని రాజు కాలనీకి చెందిన మంగమ్మ (45) బుధవారం ఫిరోజ్‌గూడ ఎంఎంటీఎస్ రైల్వే ట్రాక్‌పై కూర్చుని ఆత్మహత్యకు యత్నించింది. సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న కానిస్టేబుళ్లు రవీందర్, సుధాకర్‌రెడ్డి ఆమెను రక్షించారు. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్


Real Estate

LAND FOR SALE

■ మన తెలంగాణలో కొల్లాపూర్, తిరుపతి హైవే మరియు బెంగుళూర్ హైవేలో ఫాంల్యాండ్ శ్రీగంధం మొక్కలతో, 1/2 అర ఎకరము భూమి కేవలం 15 లక్షలు మాత్రమే. Ph: 9177619716. [HA-15296]

■ Agriculture Land Near Sangareddy Per Acre 98 Lakhs, TOOPRAN 2cr 50 Lakhs & 150 Sq Yards 4lakhs Ready for Construction Near Siddipet. 7993545328. [H-99555]

LEASE

■ Looking For Long Lease Land Req 1500 Sqyds+ Min lease8 years + Locations: Gowlidoddi Tellapur Nallagandla Gopanpalli Kokapet 9063254533 [SCA25001164]


Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800523]

■ మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 [SCA25001126]

BUSINESS OFFER

■ Army Garrison at Mehdipatnam invites application from war widows / widows of soldiers killed on duty/ disabled / ESM & spouses of ESM for allotmentof Stationery Shop for operation within the Garrison. All interested may collect and submit the application form,Last date of submission of application is 31 Jan 2025. Applicants are requested to submit their applications online to basantarwarriors47@gmail.com or directly you can submit at 47 Infantry Brigade Camp Office. [HA-15386]

DISTRIBUTORS

■ Wanted Distributors for our Packaged Drinking Water Bottle under the brand name "PURE" in Telangana 9063254533 [SCA25001166]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Hajra Begum W/o Mohammed Yousuf Ali R/o: H.no 2-37, Kalkoda Village, Marpally Mandal Vkb Dist Changed My Name From Pogaku Hajra Begum to HAJRA BEGUM [SCA25001163]

■ I, Y Rajani W/o, Kataram Narender R/o 16-11-1/5/6/2, No1 Saleem Nagar, Malakpet, Hyderabad 500036. Have changed my name to Kataram Lavanya for all purposes. [DA-40532]

■ I, Vineela Reka Bojja W/o, Surender Rao Bojja R/o Flat 201 Venkata Sai Residency Shilpa Park Kondapur Hyderabad have changed my name to Vineela Reka Somarajpali for all purposes. [DA-12914]

■ I, K.V.Sathi Spouse of Number - RC 668K, Rank- Lt Col, Name- Krishnan K V, resident of F-Block 708, Rainbow vistas rockgarden, Green Hills road, Moosapet, Medchal-malkajgiri, Telangana - 500018, have change my name K.V.Sathi to Sathi Krishnan vide affidavitno. BG439422 & BG439423 dt. 13-01-2025 be for Sathi Krishnan. [SCA25-1170]


Wanted

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15309]

■ కాలేజీ హాస్టల్ క్యాంటీన్‌లో పనిచేయుటకు. North Indian, South Indian మాస్టర్స్, కటింగ్ మాస్టర్స్, ఆయాలు, క్లీనింగ్ బాయ్స్ కావలెను. Contact: 7013995991 [HA-5018]

■ న్యూ సిద్ధి హోల్డ్ ఏజ్ హోమ్ లో ఆయాలు, లేడీ హెల్పర్స్, లేడీ టెలీకాలర్స్, నర్సులు, భార్యభర్త పనిచేయుటకు కావలెను. రూం + భోజనం ఫ్రీ. ఫోన్ : 90527 61999, 90527 62999 [V- SCA25001169]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్ కావలెను. నాగోల్, బాచుపల్లి, సనత్ నగర్, ఇస్నాపూర్, LB నగర్. జీతం : 8K-22K+ రూం. Ph: 8331837003 [HA-15306]

■ వర్క్‌ఫ్రమ్‌హోమ్ అవర్చునిటి, ఇంట్లో పని చూసుకుంటూ తీరిక సమయంలో Online లో వర్క్ చేసుకోవచ్చు.2 or 3గం॥ 20K-30K. వః 20-50సం॥ ☏8500348714,9515730117 [G-795849]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

భార్య ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతోందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య • కేసు నమోదు చేసిన పోలీసులు


శివశంకర్ (ఫైల్)

కడ్తాల్: భార్యపై అనుమానంతో ఓ భర్త ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్‌కు చెందిన సిద్దిగారి శివశంకర్(28)కు నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం జకినాలపల్లికి చెందిన మౌనికతో గతేడాది ఏప్రిల్ నెలలో వివాహం జరిగింది. భార్యాభర్తలు మొదటి నుంచీ గొడవ పడుతుండేవారు. ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతోందనే కారణంతో శంకర్ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్తాపానికి లోనై మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో, ఫ్యాన్ కొండికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి


దశరథగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

యాచారం: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, యాచారం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు దశరథగౌడ్(65) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో కన్నుమూశాడు. ఉమ్మడి ఏపీలో హోంమంత్రిగా పనిచేసిన టి.దేవేందర్‌గౌడ్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందాడు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. దశరథగౌడ్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. పలు రాజకీయ పక్షాల నాయకులు యాచారంలోని నివాసంలో దశరథగౌడ్‌కు మృతదేహానికి నివాళుర్పించారు.

సెలవుల్లోనూ సై అన్నారు!

- ప్రధాన రహదారులపై రేయింబవళ్లు పనులు
- తాగునీటి డ్రైనేజీ పైపులైన్‌లకు మరమ్మతులు
- విధులు నిర్వర్తించిన జలమండలి ఉద్యోగులు
- అభినందించిన ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్


మూసాపేట్‌లో రాత్రి పూట పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి, సిటీబ్యూరో: పండగ సమయంలోనూ జలమండలి యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి నగరంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతు పనులు చక్కబెట్టింది. సంక్రాంతి సెలవులతో కొన్ని శాఖల ఉద్యోగులు కుటుంబ సమేతంగా ఊరెళ్లగా.. మరి కొందరు ఇంటి పట్టునే ఉండగా.. జలమండలి ఉన్నతాధికారులు, సిబ్బంది మాత్రం తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణ రోజుల్లో రద్దీగా ఉండే నగరంలోని ప్రధాన రహదారులపై సంక్రాంతి పండగ సెలవులతో వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. దీంతో జలమండలి సిబ్బంది ముందస్తు ప్రణాళికతో పైపులైన్ లీకేజీలు, పైపులైన్ల మార్పిడి పనులు చేపట్టి పలు సమస్యలను పరిష్కరించారు. నగరంలో కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, పంజాగుట్ట, మూసాపేట్, బంజారాహిల్స్, జగద్గిరిగుట్ట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడ్డ లీకేజీలు, సీవరేజ్, ఇతర సమస్యలను రాత్రి, పగలు తేడా లేకుండా పని చేశారు. అవసరమైన చోట్ల పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగారు.

పనులు ఇలా..

నగరంలో రెండు రోజుల పాటు రాత్రి సమయాల్లోనూ రోడ్ క్రాసింగ్ పనులు నిర్వహించారు. మూసాపేట, కేపీహెచ్‌బీ పరిధిలోని ఫోరం మాల్ సర్కిల్ దగ్గర సీవరేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. మూసాపేట్‌లోని ఆంజనేయనగర్ లో సీవరేజీ పైపులైన నిర్మాణ పనులు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్- 10 లో ఏర్పడిన లీకేజీని అరికట్టారు. జగద్గిరిగుట్టలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద లీకేజీని కట్టడి చేశారు. ప్రగతి నగర్‌లో నీటి సరఫరా పెంచడానికి గ్యాప్ క్లోజర్ పనులు నిర్వహించారు. పంజాగుట్ట క్రాస్ రోడ్స్‌లో సీవరేజ్ పైపులైన్ డ్యామేజీ కావడంతో దానికి మరమ్మతులు నిర్వహించారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రధాన రహదారులపై చేపట్టిన పనులు సంబంధిత సర్కిళ్ల జీఎంలు, సెక్షన్ల మేనేజర్లు పరిశీలించారు. నగరంలోని రోడ్లు ఖాళీగా ఉండటం పనులకు మరింత కలిసి వచ్చినట్లయింది. జలమండలి ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో కూడా ప్రధాన రహదారులపై అంతగా డీ సిల్టింగ్ ప్రక్రియ కొనసాగలేదు. దీంతో సెలవులు దినాల్లో మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించారు. సంక్రాంతి సెలవుల్లో సమస్యలను పరిష్కరించడానికి సరైన సమయమని భావించి మరమ్మతులు చేపట్టారు. సాధారణ సమయంలో ఇలాంటి పనులు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండటంతో ఇప్పుడు వాటిని చేపట్టారు. సంక్రాంతి పండగ సమయాల్లోనూ పని చేసిన జలమండలి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మాయాంక్ మిట్టల్ అభినందించారు.

పుప్పాలగూడలో జంట హత్యల కలకలం

కత్తులతో పొడిచి.. బండరాళ్లతో మోది ఇద్దరి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే ప్రాణాలు తీసిందా?
- నిందితుల కోసం పోలీసుల వేట


బిందు


అంకిత్ సాకేత్ (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో జంట హత్యల ఘటన కలకలం రేపింది. వివాహితను, ఆమె ప్రియుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మంగళవారం గాలిపటాలు ఎగురవేసేందుకు పద్మనాభ స్వామి గుట్టల వైపు వెళ్లిన యువకులకు అక్కడ రెండు మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించడంతో జంట హత్యల ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బేమెతరా జిల్లా నమాగఢ్‌కు చెందిన బిందు బింజారె (27)కు, ఇదే రాష్ట్రం ముంగిలి జిల్లా బయక్‌కాంప గ్రామానికి చెందిన వ్యక్తితో పదకొండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బిందు కుటుంబం బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఓ విల్లా ప్రాజెక్ట్‌లో మేస్త్రీ, కూలీలుగా భార్యాభర్తలు కొంత కాలం పని చేశారు. అనంతరం వనస్థలిపురం వచ్చారు.

ప్రియుడి మోజులో పడి.. కుటుంబాన్ని వదిలి..

గతంలో శంకర్‌పల్లి సైట్‌లో పని చేసినప్పుడు బిందుకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంకిత్ సాకేత్ (27) ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ప్రియుడి మోజులో పడిన బిందు తన కుటుంబాన్ని వదిలేసి ఈ నెల 4న అంకిత్ సాకేత్ ఉంటున్న నానక్‌రాంగూడకు వచ్చేసింది. తన వద్దకు వచ్చిన బిందును సాకేత్ తన స్నేహితుల గదిలో ఉంచాడు. ఈ క్రమంలో తన భార్య బిందు కనిపించడంలేదంటూ భర్త ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అదే రోజు పిల్లలను తీసుకుని స్వస్థలానికి వెళ్లిపోయాడు.

నిర్మానుష్య ప్రదేశంలో శవాలుగా బిందు, అంకిత్ సాకేత్..

నానక్‌రాంగూడలో ఉంటున్న అంకిత్ సాకేత్ కనిపించటం లేదని ఆయన తమ్ముడు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న ఫిర్యాదు చేశాడు. కాగా.. పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశమైన పద్మనాభస్వామి ఆలయ పరిసరాల్లోని గుట్టల్లో బిందు, సాకేత్ మృతదేహాలు స్థానికులకు కనిపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు వీరిని కత్తులతో పొడిచి, ముఖాలు గుర్తించకుండా బండరాళ్లతో మోది దారుణంగా హత్య చేశారు. జంట హత్యలు ఈ నెల 11, 12 తేదీల్లో జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

భిన్న కోణాల్లో విచారణ ముమ్మరం..

జంట హత్యల ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిలు మంగళవారం పరిశీలించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్‌లతో వివరాలు సేకరించారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. బిందు, అంకిత్ సాకేత్‌లతో పాటు మరో ముగ్గురు అటుగా వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బిందును గదిలో ఉంచిన సాకేత్ మిత్రులా? లేదా గతంలో శంకర్‌పల్లిలో పని చేసిన సమయంలో బిందుతో పాటు పనిచేసిన వారా? లేక ఇతరులెవరైనా వారిని అక్కడ చూసి అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి శరీరం కింది భాగంలో దుస్తులు లేకపోవటంతో అత్యాచారం చేసి హతమార్చారా? బిందు, సాకేత్ ఏకాంతంగా ఉన్న సమయంలో హత్య చేశారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం సమీపంలో సుమారు 10 ఖాళీ బీరు సీసాలు ఉన్నాయి. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం సాయంత్రం మృతుల బంధువులకు అప్పగించారు.

పండగ పూటా ఇదేం పద్ధతి?

- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై పారిశుద్ధ్య కార్మికుల వేదన
- ఓ గంట ముందుగా ఇంటికి పోనివ్వకపోడవంపై అసహనం

సాక్షి, సిటీబ్యూరో: పండగా.. పబ్బమూ అని లేకుండా కరోనా విపత్కర పరిస్థితులెదురైనా విధులు నిర్వర్తించి నగర ప్రజల ఆరోగ్యం కోసం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పండగల పూటైనా కనీసం గంట ముందు వెళ్లనివ్వకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరును పలువురు తప్పుపడుతున్నారు. నగరంలో ఒక్కరోజు పారిశుద్ధ్య పనులు జరగకున్నా, ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు సెలవులివ్వడం లేదు. దీంతో పండగలకు సెలవులు పెట్టకుండానే కార్మికులు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ పండగలు చేసుకునే సమయంలో వీరికి కనీసం గంటో, రెండు గంటలో నిర్ణీత వ్యవధి కంటే ముందుగా ఇళ్లకు వెళ్లే సదుపాయం కల్పించాలని కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తి మేరకు అప్పటి కమిషనర్ ఆమ్రపాలి మినహాయింపునిచ్చారు. రోజూ మాదిరిగా పనిలోకి వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు రెండు పర్యాయాలు 'అటెండెన్స్' బదులు ఒక్కసారి వేస్తే చాలు అని మినహాయింపు ఇచ్చారు. అయితే.. వారు చేయాల్సిన పని మొత్తం పూర్తిచేసి త్వరితంగా వెళ్లిపోవచ్చని స్పష్టం చేశారు. ఎవరైనా వీఐపీల కార్యక్రమాలుంటే తప్ప పండగల సందర్భాల్లో ఒకసారి హాజరు చాలునని సర్క్యులర్ జారీ చేశారు. దసరా పండగ సందర్భంగా దాన్ని వర్తింపజేశారు. సంక్రాంతికి మాత్రం అధికారులు తమను పూర్తి సమయం వరకు ఉండాల్సిందేనని పట్టుబట్టారని, తమకు మాత్రం కుటుంబాలు ఉండవా.. ఊళ్లకు వెళ్లకున్నా కనీసం ఇంటికి త్వరగా వెళ్లి పనులు చేసుకోవద్దా? అని పలువురు మహిళా కార్మికులు వాపోయారు. దీనిపై ఓ అధికారి వివరణనిస్తూ, అప్పట్లో మినహాయింపు ఇచ్చినప్పుడు కేవలం దసరాకు మాత్రమే ఇచ్చారని, ముఖ్యమైన పండుగలకు అలాంటి మినహాయింపు ఉంటుందని తెలిపినప్పటికీ, ప్రతి పండగకు ముందస్తుగా విజ్ఞప్తి చేసుకోవాలని సూచించారన్నారు. ప్రతి పెద్ద పండగకూ విజ్ఞప్తి చేసుకోవడమేమిటన్నారు. తాము ఎవరికి విజ్ఞప్తి చేసుకోగలమని, ప్రతిసారీ యూనియన్ నేతలను ఆశ్రయిస్తే, వారు విజ్ఞప్తి చేయాలా? అని పారిశుద్ధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా పనులు చేసేది తామేనని, అయినా చేయాల్సిన పని మొత్తం పూర్తి చేశాకే కదా ఇళ్లకు వెళ్లేది. పనిలేకున్నా పూర్తి సమయం వరకు ఉండాలనడం ఏం న్యాయం అంటున్నారు. ఇప్పటికైనా ఈ అంశంలో ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకొని, భవిష్యత్‌లోనైనా వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.